RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 7 | పేజీలు : 4 | గురువారం 9 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. ఆస్ట్రేలియాలో స్పందించిన ప్రధాని మోదీ

పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆందోళన
అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ మొదలైన సైనిక దాడులు
చర్చలు, దౌత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్న మోదీ

## 29 గ్రామాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ... అమరావతి రైతు జేఏసీ కీలక నిర్ణయం

ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు ఇచ్చేందుకు రైతు జేఏసీ కీలక నిర్ణయం
కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్న జేఏసీ
గతంలో జేఏసీలకు సరైన కమిటీలు లేవని వ్యాఖ్య



రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అమరావతి 'రైతు జేఏసీ' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని మొత్తం 29 గ్రామాల ప్రతినిధులతో ఒక ప్రత్యేక అభివృద్ధి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు తీర్మానించారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అసలైన రైతుల ఉమ్మడి సమస్యలు పక్కదారి పడుతున్నాయని జేఏసీ అభిప్రాయపడింది. అందుకే అందరి తరఫున మాట్లాడేలా ఒక అధికారిక కమిటీని తేవాలని నిర్ణయించింది. రాజధాని నిర్మాణం కోసం తాము ఎప్పుడో భూములు ఇచ్చినప్పటికీ... క్షేత్రస్థాయిలో రైతులకు సంబంధించిన అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే అభివృద్ధి కమిటీ ద్వారా ఈ సమస్యలన్నింటినీ నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంత అభివృద్ధి అనేది కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా 29 గ్రామాల్లోనూ సమానంగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "గతంలోనూ జేఏసీలు ఏర్పాటు చేశారు కానీ, వాటిలో సరైన కమిటీ వివరాలు లేవు. ఇప్పుడు ఎవరికి వారే తామే నాయకులమనే తీరుగా వ్యవహరిస్తున్నారు. అలా కాకుండా, కొత్త కమిటీలో ప్రతి గ్రామం నుంచి అన్ని కులాల వారికి సమాన ప్రాధాన్యత ఇస్తాం" అని రైతు జేఏసీ నేతలు వెల్లడించారు.

## గుటుపల్లె భూముల వివాదం..

### స్వయంగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం చంద్రబాబు



బేతంచెర్ల మండలంలో 22ఏ జాబితాలోని భూములకు విముక్తి
సీఎం చంద్రబాబు సమక్షంలో 2,074 ఎకరాల తొలగింపు ప్రక్రియ
గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై నిర్ణయం
వేల ఎకరాల వక్ఫ్, చుక్కల భూముల సమస్యలకు కూడా పరిష్కారం
సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులైన రైతులు





నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల రైతులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాశ్వత పరిష్కారం చూపారు. గత ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలో పెట్టిన వేలాది ఎకరాల భూములకు విముక్తి కల్పించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్వయంగా బనగానపల్లె తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం, తన సమక్షంలోనే అధికారిక ప్రక్రియను పూర్తి చేయించారు. బేతంచెర్ల మండలం గుటుపల్లె గ్రామంలోని సర్వే నెం. 215లో ఉన్న 2,669 ఎకరాల సర్వీసు ఇనాం భూములను గత ప్రభుత్వం 1908 నాటి చట్టాన్ని కారణంగా చూపి 22ఏ జాబితాలో చేర్చింది. దీంతో రైతులు తమ భూములపై హక్కులు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మార్చిలో తమ గోడును ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు. వారి వినతిపై స్పందించిన ప్రభుత్వం, 2,074 ఎకరాల పట్టాభూమిని 22ఏ(1)(సి) జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. గురువారం బనగానపల్లె తహసిల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌లు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఈ ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో, 2023లో జాబితాలో చేర్చిన 426 ఎకరాల వక్ఫ్ భూములను కూడా తొలగించడంతో 897 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వీటితో పాటు బనగానపల్లె నియోజకవర్గంలో 23 మంది రైతులకు చెందిన 101 ఎకరాల చుక్కల భూములను కూడా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనంతరం సీఎం చంద్రబాబు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో లబ్ధిదారులైన రైతులతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు వారి భూములను తిరిగి అప్పగించామని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి



బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు.

## గ్రామీణ వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశారు

బనగానపల్లెలో గ్రామసభ నిర్వహించిన జనార్ధన్ రెడ్డి
వైసీపీ హయాంలో బలగానపల్లెలో అభివృద్ధి శూన్యమని విమర్శ
బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని వైసీపీ నిలిపేసిందని మండిపాటు



బనగానపల్లెలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బ్రహ్మంగారు నడయాడిన పవిత్రమైన బనగానపల్లెలో గత ఐదేళ్ల వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని, కేవలం అరాచక పాలనే సాగిందని మండిపడ్డారు. వైసీపీ పాలనలో జగన్ గ్రామీణ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని వైసీపీ నిలిపివేసిందని, తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. అలాగే 41 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేశామని వెల్లడించారు. ఐదేళ్లలో రాయలసీమ కోసం వైసీపీ ఏం చేసింది? తామేం చేశామో ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు తాము సిద్ధమని... దమ్ముంటే చర్చకు రావాలంటూ మంత్రి సవాల్ విసిరారు.

## గృహ నిర్మాణంలో అగ్రస్థానం మనదే..!!

.....జిల్లాలో
గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ ఎండీ అరుణ్ బాబు, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఉన్నత స్థాయి సమీక్ష
.....గృహ నిర్మాణ పథకం అమలులో రాష్ట్రంలోనే శ్రీ సత్యసాయి జిల్లాకు అగ్రస్థానం (పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌లో ఫస్ట్ ర్యాంక్)
....లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం







పుట్టపర్తి, జూలై 09 సీమ వార్త సాయంత్రం.

గృహ నిర్మాణ పథకం అమలులో రాష్ట్రంలోనే శ్రీ సత్యసాయి జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో చేపట్టిన వివిధ గృహ నిర్మాణ పథకాల ప్రగతిపై గురువారం హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు గారు, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఎండీ అరుణ్ బాబు మాట్లాడుతూ కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమీక్ష సమావేశంలో హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ... 'పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో గృహ నిర్మాణ పథకాలకు సంబంధించి ప్రజల్లో ఉన్న సానుకూలత జూన్ నెలలో 93.56% కి పెరిగి, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మే నెలతో పోలిస్తే సానుకూలతలో 23.59% స్పష్టమైన ప్రగతి కనిపించిందని, ఇదే ఉత్సాహంతో పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 57,889 ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 28,639 గృహాల నిర్మాణాలు విజయవంతంగా పూర్తయ్యాయి. మిగిలిన 29,250 ఇళ్ల పనులు వివిధ దశల్లో వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఇందుకోసం జిల్లాలో ఇప్పటివరకు రూ. 700.07 కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగింది.ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా 7వ విడత వరకు మంజూరైన 3,051 ఇళ్లకు గానూ, రికార్డు స్థాయిలో 2,474 (81.09%) ఇళ్ల గ్రౌండింగ్ పనులను పూర్తి చేసి శ్రీ సత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచింది. ధర్మవరం అర్బన్, హిందూపూర్ అర్బన్, కదిరి అర్బన్ మరియు పుట్టపర్తి అర్బన్ పరిధిలోని మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన జియో-ట్యాగింగ్ చేయాలని సూచించారు.ఆర్థిక సంవత్సరం 2026-27 లక్ష్యాలలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 7,884 ఇళ్లు పూర్తి కాగా, గడచిన వారంలోనే 18 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.ఆప్షన్ 1 & 2 కింద జిల్లాలో 3,739 మంది లబ్ధిదారులకు రూ. 7.96 కోట్ల అదనపు నిధులను ఎఫ్‌టీఓల ద్వారా విడుదల చేయడం జరిగింది. దీని ద్వారా 1,347 ఇళ్లు పూర్తి కాగా, 160 ఇళ్లు వివిధ దశల్లో ప్రగతి సాధించాయి.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు ఎఫ్ టి ఓ లు జనరేట్ చేస్తున్నామని, హౌసింగ్ అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ శ్రీ సత్యసాయి జిల్లాను గృహ నిర్మాణంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి, లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో హౌసింగ్ పిడి వెంకట నారాయణ, హౌసింగ్ విభాగపు ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీనగర్లో హస్తమించిన..
# జవాన్ "రవి"చంద్రుడు

**గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి వాసి రవి చంద్రారెడ్డి సిఆర్పిఎఫ్ విధులు నిర్వహిస్తూ మృతి.**




**గోరంట్ల జులై 9 సీమ వార్త సాయంత్రం**

దేశ భద్రత కోసం సిఆర్పిఎఫ్ లో చేరి జమ్ము కాశ్మీర్ సమీపంలోని శ్రీనగర్లో ఎస్సై విధులు నిర్వహిస్తూ గోరంట్ల మండలం ఎగువ గంగంపల్లి పంచాయతీ దిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన జవాన్ రవి చంద్రారెడ్డి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దిగునపల్లి గ్రామానికి చెందిన నంది రెడ్డి, లక్ష్మీదేవమ్మ ల నాలుగో సంతానం రవి చంద్రారెడ్డి. రవి చంద్రారెడ్డి గత 36 ఏళ్ల క్రితం సిఆర్పిఎఫ్ లో చేరాడని గత రెండు రోజుల క్రితం రాత్రి వీధుల్లో ఉండగా మరణించినట్లు తెలుస్తోంది. అయితే ఆయన మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో వారి కుటుంబములతో పాటు గ్రామంలో విషాదఛాయలు అమలు కున్నాయి. శ్రీనగర్లో శవపరీక్షల అనంతరం జవాన్ మృతదేహాన్ని శ్రీనగర్ నుంచి బెంగళూరుకు విమానం ద్వారా అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో వారి స్వగ్రామం అయిన దిగువ గంగంపల్లి లో అంత్యక్రియలు చేపట్టనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


గురువారం 9 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా


# పల్లె పొలాల్లో... ఢిల్లీ సైంటిస్ట్లు ల్యాండింగ్..!!

**ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఢిల్లీ 'తేరి' పరిశోధనా బృందం.**

**ఆదర్శ రైతు ప్రసాద్కు ఢిల్లీ 'తేరి' పరిశోధనా బృందం అభినందనలు.**

**బత్తలపల్లి మండలంలోని ఉప్పరపల్లి పొలాల్లో... ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన**



**ధర్మవరం జూలై 9 సాయంకాలం సీమ వార్త :**

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) పద్ధతులపై శాస్త్రీయ అధ్యయనంలో భాగంగా ఢిల్లీకి చెందిన ప్రముఖ జాతీయ పరిశోధనా సంస్థ 'తేరి' (ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్స్టిట్యూట్) బృందం బత్తలపల్లి మండలంలో పర్యటించింది. మండల పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు కె. ప్రసాద్కు చెందిన ప్రకృతి వ్యవసాయ ఎ-గ్రేడ్ మోడల్' వేరుశనగ పొలాన్ని ఈ పరిశోధనా బృందం క్షేత్రస్థాయిలో సందర్శించి, నిశితంగా పరిశీలించింది. ఈ పరిశోధనా బృందంలో 'తేరి' సంస్థ సహ-ప్రధాన పరిశోధకులు రహమాన్, యువ పరిశోధక నిపుణులు పూర్ణచంద్ర మరియు ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర స్థాయి బృందం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశోధకులు రైతు ప్రసాద్తో ముఖాముఖి మాట్లాడి, రసాయన ఎరువులు మరియు పురుగుల మందులు వాడకుండా కేవలం ప్రకృతి సిద్ధమైన కషాయాలు, జీవామృతాలతో వేరుశనగ పంటను ఎలా సాగు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు క్షేత్రస్థాయిలో అమలవుతున్న సాంకేతిక విధానాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ప్రకృతి వ్యవసాయ మోడల్స్ ఇస్తున్న ఫలితాలు, మరియు పండిన పంటల మార్కెటింగ్, మద్దతు ధర వంటి పలు కీలక అంశాలపై ఈ ఢిల్లీ బృందం రైతుతో సుదీర్ఘంగా చర్చించింది. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ, తక్కువ ఖర్చుతో నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధిస్తున్న రైతు కె. ప్రసాద్ను 'తేరి' పరిశోధనా బృందం మరియు రాష్ట్ర ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ఈ వివరాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పరిశోధనలకు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

# తాడిపత్రిలో మళ్ళీ రాజకీయ ఉద్రిక్తత..!!

**....పుప్పాల దాడి వెనుక రాజకీయ కుట్ర ....మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు**

**15 మంది దాడి: టీడీపీ మాజీ సర్పంచ్ కు తీవ్ర గాయాలు**

**తాడిపత్రిలో మళ్లీ రాజకీయ ఉద్రిక్తత.. దాడి ఘటనతో గ్రామంలో భయాందోళన**

**తాడిపత్రి, జులై 08, సీమ వార్త సాయంత్రం:**



తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండలం పుప్పాల గ్రామంలో టీడీపీ మాజీ సర్పంచ్ పై జరిగిన దాడి వెనుక రాజకీయ కుట్ర ఉందంటూ సంచలన ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**కాపు కాచి వేటకొడవళ్లతో దాడి**

గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ దేవేంద్ర పై సుమారు 15 మంది వ్యక్తులు ముందుగానే కాపు కాచారు. వేటకొడవళ్లు, రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దాడిలో దేవేంద్రకు తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.



**మాజీ ఎమ్మెల్యేపై సంచలన ఆరోపణలు**

ఈ దాడి వెనుక మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి హస్తం ఉందని బాధిత వర్గం ఆరోపిస్తోంది. "మ్మల్ని రాజకీయంగా అణచివేయడానికే ఈ దాడికి పాల్పడ్డారు" అని దేవేంద్ర కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నేతల స్పందన ఇంకా రావాల్సి ఉంది.

**టీడీపీ నేతల పరామర్శ, నిరసన**

సమాచారం అందుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి ఆసుపత్రికి చేరుకుని దేవేంద్రను పరామర్శించారు. దాడిని ఖండిస్తూ టీడీపీ నేతలు నిరసన తెలిపారు. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**పోలీసు విచారణ, బందోబస్తు**

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. "బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తాం" అని సీఐ తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**గ్రామంలో భయాందోళన**

పట్టపగలు జరిగిన ఈ దాడితో పుప్పాల గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాజకీయ వైషమ్యాలు ఇలా హింసకు దారితీయడం సరికాదని, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు పొలాలకు "అస్మిత్" జలం..!!

**..... కాలువ క్లియరెన్స్ తో... రైతు పొలాలకు నీటి పరవళ్ళు..!!**

**....రైతుల కోసం జెసి అష్మిత్ రెడ్డి చొరవ: ....సొంత నిధులతో కాలువ పూడికతీత**

**....పచ్చారుమేకలపల్లి వద్ద ముళ్ల పొదల తొలగింపు.....యాడికి కాలువ పూడికతీతతో వేల ఎకరాలకు ఊరట.**

**తాడిపత్రి , జులై 08, సీమ వార్త సాయంత్రం:**



రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తాడిపత్రి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి మరోసారి తన చొరవను చాటుకున్నారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా సొంత నిధులు వెచ్చించి యాడికి కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. అనంతపురం జిల్లా యాడికి మండలం పచ్చారుమేకలపల్లి వద్ద ఉన్న యాడికి కాలువలో గత కొన్నేళ్లుగా పూడిక పేరుకుపోయింది. ముళ్ల పొదలు దట్టంగా పెరిగి నీటి ప్రవాహానికి పూర్తిగా అడ్డంకిగా మారింది. దీంతో సుమారు 3000 ఎకరాలకు పైగా ఆయకట్టు రైతులు ఖరీఫ్ పంట సాగుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నారు.

**ఎమ్మెల్యే చొరవ**

రైతుల గోడును తెలుసుకున్న ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి వెంటనే అధికారులతో సమీక్షించి, సొంత నిధులతో పూడికతీత, ముళ్ల పొదల తొలగింపు పనులను ప్రారంభింపజేశారు. జీజదీలు, కూలీలతో పనులు వేగంగా సాగుతున్నాయి.





ఈ పనుల వల్ల కాలువలో నీటి ప్రవాహం మెరుగుపడి, పచ్చారుమేకలపల్లి, యాడికి, పరిసర గ్రామాల్లోని వేల ఎకరాల పంటలకు సాగునీరు సజావుగా అందనుంది. స్థానిక రైతు రామయ్య మాట్లాడుతూ "5 ఏళ్లుగా ఈ సమస్య ఉంది. ఎవరూ పట్టించుకోలేదు. జెసి అష్మిత్ రెడ్డి సొంత డబ్బుతో మా బతుకులు బాగు చేశారు. ఆయనకు మా జన్మ ఋణం" అని ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రజా ప్రతినిధికి ఆదర్శం**

ఓట్ల కోసం కాకుండా ప్రజా సమస్యలను స్వయంగా పరిష్కరిస్తున్న జెసి అష్మిత్ రెడ్డి పనితీరు రాష్ట్రంలోని ఇతర ప్రజా ప్రతినిధులకు ఆదర్శంగా నిలిచింది. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వానికి ఇది నిదర్శనమని స్థానికులు కొనియాడుతున్నారు.



# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..
# ఆస్ట్రేలియాలో స్పందించిన ప్రధాని మోదీ

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో, సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ఏకైక మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన, గురువారం మెల్బోర్న్లో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడటంతో, అమెరికా ప్రతిగా సైనిక చర్యలు చేపట్టింది. ఇరాన్కు చెందిన బుషెహర్, చాబహార్ సహా పలు తీర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై దాడులు జరిపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ దాడులతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ పరిణామాలపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్తో కలిసి మీడియాతో మాట్లాడిన మోదీ, "ప్రపంచంలో కొనసాగుతున్న ఏ వివాదానికైనా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. పౌరుల భద్రతను కాపాడాలని, వాణిజ్య కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఇరు దేశాల నేతలు సంయుక్త ప్రకటనలో కోరారు. పశ్చిమాసియాలో తలెత్తిన ఈ తాజా ఘర్షణలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, వాణిజ్య మార్గాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాలకు చమురు సరఫరా, ఇంధన భద్రతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే భారత్ తన ప్రయోజనాలను, ప్రవాస భారతీయుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దౌత్యపరమైన పరిష్కారాన్ని ఆకాంక్షిస్తోంది.

# సాధికారత సాధనే సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం లక్ష్యం





సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే పి కుమార్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు దూలం లలితమ్మ, ఉపాధ్యక్షురాలు చదివే విష్ణు మమత

**కదిరి, జూలై :సీమ వార్త సాయంత్రం.** రాష్ట్రంలోని గాండ్ల తెలికుల సామాజిక వర్గీయుల ఆత్మగౌరవాన్ని చాటుతూ, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సాధికారతను సాధించడమే సమస్త గాండ్ల తెలికుల ప్రజా సంక్షేమ సంఘం (ఎస్ జి టి పి ఎస్ ఎస్) లక్ష్యమని రాష్ట్ర నాయకులు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ ఆదేశాల మేరకు, రాష్ట్ర ముఖ్య నాయకులు గిరి శ్రీనివాస్ దిశా నిర్దేశంలో ఎస్ జి టి పి ఎస్ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే పి కుమార్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు దూలం లలితమ్మలు, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు చదివే విష్ణు మమత, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ముత్యాల ఆదినారాయణతో కలిసి బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. సమస్త గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్రంలోని కులస్తుల విద్య, స్వయం ఉపాధి, రాజకీయ, సాధికారతలో బలోపేతానికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. గాండ్ల తెలికుల సమాజ ఐక్యత, సంక్షేమం, అభివృద్ధి, సాధికారతను లక్ష్యంగా ఏర్పడిన ప్రజా వేదిక అని అన్నారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, మహిళా సాధికారత, యువజన నాయకత్వ వికాసం, కులవృత్తి పరిరక్షణ, సామాజిక న్యాయం, ఆర్థిక ప్రగతి వంటి రంగాలలో సమాజాన్ని సంఘటితం చేసి, సమష్టి శక్తితో ముందుకు తీసుకెళ్లడం ఈ సంఘం ప్రధాన ఆశయం. "ప్రజలతో, ప్రజలకై, ప్రజా నాయకత్వం" అనే ధ్యేయంతో ప్రతి కుటుంబానికి చేరువై సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయనుందన్నారు. ఈ లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర నాయకులు విస్తృతంగా పర్యటిస్తూ, ప్రతి జిల్లాలో సభ్యులతో సమావేశాలు నిర్వహించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా జిల్లా కార్యవర్గాల ఏర్పాటు, బాధ్యతల ప్రకటన చేపట్టనున్నారని అన్నారు. ప్రతి జిల్లాలో సమర్థవంతమైన నాయకత్వాన్ని నిర్మించి, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలమైన సంఘటిత వ్యవస్థను ఏర్పాటు చేసి, గాండ్ల తెలికుల సమాజానికి శాశ్వతమైన సేవా వేదికగా ఎస్ జీ టీ పీ ఎస్ ఎస్ ను అభివృద్ధి చేయడమే మా సంకల్పమన్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలో కార్యవర్గాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజిటి యు పి ఎస్ ఎస్ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కే. హరికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదివే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్ సీ వీ మదన్ కుమార్ కు సత్కారం**

ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు, భారతీయ సేవారత్న అవార్డు గ్రహీత డాక్టర్ సి వి మదన్ కుమార్ ను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే పి కుమార్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు దూలం లలితమ్మ, ఉపాధ్యక్షురాలు చదివే విష్ణు మమతతో పాటు మిగతా సభ్యులు పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. వైద్యరంగంలో ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కే. లోకేష్, మారుతి, మధు తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర దానంతో రెండు కుటుంబాలకు కంటి వెలుగులు





**ధర్మవరం జూలై 9 సీమ వార్త సాయంత్రం.** ధర్మవరం శాంతినగర్ కి చెందిన కీ శే గాండ్ల సూర్యనారాయణ (వయస్సు 47) అకాల మరణం చెందగా విశ్వదీప సేవా సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారం మేరకు అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డివై కుల్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ వారి టెక్నీషన్ జి. రాఘవేంద్ర ఉదయం కంటి కార్నియా సేకరించడం జరిగింది . నేత్రదానానికి సహకరించిన దాత తల్లి నారాయణమ్మ భార్య కోమల కుమారుడు మణిదీప్ కుమార్తె భార్గవి అల్లుడు అశోక్ తమ్ముళ్లు చంద్రశేఖర్, సుధాకర్, జయరాం, ఓంకార్ బయన్న లకి విశ్వదీప సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు గాజుల సురేష్, సెక్రటరీ జూజారు రఘు, టీ. చంద్రశేఖర్ రెడ్డి, బిల్లు నాగరాజు, ప్రభాకర్ రెడ్డి , కేశవరెడ్డి, నాగార్జున మాధవ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవం





ధర్మవరంలో నిర్వహించిన భారీ విద్యార్థి ర్యాలీ-బహిరంగ సభ.

ముఖ్య అతిథి పూర్వ విద్యార్థి పరిషత్ నాయకుడు. ఖగ్గోలు హరీశ్ బాబు.

జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించి,ర్యాలీలో విద్యార్థులతో పాటు నడక .

**ధర్మవరం జూలై 9 సాయంకాలం సీమ వార్త:** ధర్మవరం పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి సంఘం పరిషత్ ఏపీ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మవరంలో నిర్వహించిన భారీ విద్యార్థి ర్యాలీ బహిరంగ సభ విజయవంతంగా జరిగాయి. ర్యాలీ కాలేజ్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీనగర్ వరకు భారీ ఎత్తున కొనసాగింది. వేలాది మంది విద్యార్థులు, పూర్వ ఏబీవీపీ కార్యకర్తలు, నాయకులు, యువత ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి నినాదాలతో పట్టణాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జి ఖగ్గోలు హరీశ్ బాబు మాట్లాడుతూ, విద్యార్థి శక్తే దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని అన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం చదివే వారిగా కాకుండా సమాజానికి బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. దేశం, ధర్మం, సంస్కృతి పరిరక్షణలో యువత ముందుండాలని, జ్ఞానం -- శీలం -- ఐక్యత అనే సిద్ధాంతాలతో ఏబీవీపీ 78 సంవత్సరాలుగా విద్యార్థి సమాజానికి సేవ చేస్తూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందని పేర్కొన్నారు. విద్యార్థులు దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సత్యసాయి జిల్లా కన్వీనర్ గిరి వాల్మీకి మాట్లాడుతూ, దేశ సేవా సంకల్పం కలిగిన విద్యార్థి శక్తిని తయారు చేయడమే ఏబీవీపీ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడటమే కాకుండా, జాతీయత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను ప్రతి విద్యార్థిలో పెంపొందించేందుకు ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థి ఉద్యమాలను సమాజ మార్పుకు వేదికగా మార్చిన ఘనత ఏబీవీపీదేనని, ప్రతి విద్యార్థి సమాజం పట్ల బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ ఏబీవీపీ నాయకులు సాకే ఓబులేసు,గొట్లూరు చంద్ర,శంకర్ చంద్ర,బిల్లే రవి,మురళి గౌడ్ మరియు ఏబీవీపీ నగర కార్యదర్శి శివ,నాయకులు విష్ణు,చరణ్,సంతోష్,విశ్వనాథ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## రెండు కుటుంబాల్లో వెలుగులు నింపిన నేత్ర దాత.





**ధర్మవరం జూలై 9 సీమ వార్త :** ధర్మవరం శాంతినగర్ కి చెందిన కీశే కురాకుల సూర్యనారాయణ (వయస్సు 60) 9/7/2026 మరణించగా విశ్వదీప సేవా సంఘం సభ్యులు వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి అంగీకారం మేరకు అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డివై. కుల్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ వారి టెక్నీషన్ జి.రాఘవేంద్ర ఉదయం కంటి కార్నియా సేకరించడం జరిగింది . నేత్రదానానికి సహకరించిన దాత భార్య కురాకుల అలివేలమ్మ కుమార్తె ఉమామహేశ్వరీ, అంజలి, రాజకుమారి అల్లుడు రాజేష్, హరిప్రసాద్, వేంకటేష్ తమ్ముడు కురాకుల ఆంజనేయులు, మధు కి విశ్వదీప సేవా సంఘం వారు కృతజ్ఞతలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు గాజుల సురేష్, సెక్రటరీ జూజారు రఘు, తిప్పయ్య, ధనుంజయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఇటుకల తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవంలో... దేశాయ్ ఫ్యామిలీ.



**హిందూపురం జులై 10 సీమ వార్త సాయంత్రం.** హిందూపురం పట్టణ సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో నూతనంగా ప్రారంభించిన ఇటుకల తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బూదిలి నారాయణరెడ్డి కుటుంబీకులు దేశాయ్ నాగిరెడ్డి, దేశాయ్ రాజశేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వాహకులు ఇటుకల ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న దేశాయి నాగిరెడ్డి , దేశాయి రాజశేఖర్ రెడ్డి లను పరిశ్రమ ప్రొప్రైటర్ రమణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## లింగ నిర్ధరణ పరీక్షలు చట్టరీత్యానేరం.

ఆర్డీవో కార్యాలయ ఏవో. ఖతీజూన్ కుప్రా.



**ధర్మవరం జూలై 9 సీమ వార్త సాయంత్రం.** ధర్మవరం పట్టణంలోని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, చేయడం చట్టరీత్యా నేరము అని ఆర్డిఓ కార్యాలయ ఏవో ఖతిజున్ కుప్రా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ , డిఎం అండ్ హెచ్ వో ఆదేశాలమేరకు సబ్ - డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైసరీ కమిటీ అండ్ పిసిపి సమావేశము ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లింగ నిర్ధరణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని, వీటిని పాటించని స్కాన్ సెంటర్లపై కఠిన చేర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ధర్మవరం పరిధిలో గల ప్రతి స్కాన్ సెంటర్స్ ను ప్రతినెలా ఆకస్మికతనిఖీ చేస్తున్నాము అని, రిపోర్ట్స్ రికార్డ్స్ ను పరిశీలించడం జరుగుతుంది అని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లశీగించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చర్యలపై పోలీస్ డిపార్ట్మెంట్ నుండి ఎల్లవేళలా సహకారం ఉంటుందని పోలీస్ శాఖ వారు తెలిపారు. ఈ కార్యక్రమశీలో వైద్యులు జయలక్ష్మి, డీజీవో డాక్టర్ శ్వేత, జయంత్, డిఈఎంఓ కార్యాలయం నుండి రామలక్ష్మి , డిప్యూటీ హెచ్ఈఓ విజయ్ కుమార్, డి.ఎస్.పి ఆఫీస్ నుండి జాకీర్ హుస్సేన్ , రోటరీ క్లబ్ - నరేంద్ర రెడ్డి , అన్నమయ సేవాసమితి - పుల్లయ్య , కమ్యూనిటీ ఆర్గనైసార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ మహిళలకు అన్నదానం



**లేపాక్షి జులై 9 సీను వార్త సాయంత్రం.** ప్రతి వారం నా తల్లి ఆశీస్సులతో అన్న దానం చేసి ఎంతో మంది గర్భిణీ స్త్రీల ఆకలి తీర్చడం నా పూర్వ జన్మ పుణ్య?మని రామామణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రమా నందన్ తెలిపారు. లేపాక్షి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి వారం జరిగే పరీక్షలకు విచ్చేసిన గర్భిణీ మహిళలకు రమా మణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ట్రస్ట్ అధినేత, సమా జ సేవకులు,కరణం రమానందన్ శుక్రవారం దాదాపు 60 మంది మహి ళలకు ఉచితంగా పౌష్టికాహారం అంద జేసే కార్యక్రమం ప్రతి వారం లాగే యథా విధిగా నిర్వహించడం జరిగింది. కరణం రమానందన్ వారి తల్లి పేరు మీద మాతృ మూర్థులకు (గర్భిణి లకు ) భోజనం ఉచితంగా అందజేయడం నా అదృష్టం అని అయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణీ మహిళలు, రమా నందన్ గారి మిత్ర మండలి పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం
9 జులై 2026

# గోరంట్లలో.. నిర్మల మోటార్స్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ షోరూం.









ప్రారంభించిన ఏడిఎంఎస్ మోటార్ కంపెనీ ఎండి... అశోక్ మహదేవ్ తుంగడి.

గోరంట్ల శ్రీనివాస్ రాయల్ ఆధ్వర్యంలో షోరూం ప్రారంభం....హాజరైన రెండు రాష్ట్రాల డీలర్లు.

**గోరంట్ల జులై 10 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల పట్టణంలోని ప్రధాన రహదారిలో కనకదాస సర్కిల్ సి ఆర్ రెడ్డి బిల్డింగ్ లో నిర్మల మోటార్స్ ప్రొప్రైటర్ పాల డైరీ శ్రీనివాస్ రాయల్ ఆధ్వర్యంలో నూతన ఎలక్ట్రిక్ వాహనాల షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఏడిఎంఎస్ మోటార్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ మహదేవ్ తుంగడి హాజరయ్యారు. వారితోపాటు ఆంధ్ర మరియు కర్ణాటక ప్రాంత కంపెనీ డీలర్లు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో కంపెనీ ఎండి అశోక్ మహదేవ్ తుంగడి చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి షో రూమ్ లో ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజలను చేసి నూతనంగా బుక్ చేసుకున్న కస్టమర్లకు ఎలక్ట్రిక్ వాహనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎండి మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా ఏడిఎంఎస్ మోటార్ కంపెనీకి సంబంధించి మల్టిపుల్ బ్రాంచెస్ లు అనేకం ఉన్నాయని ఆంధ్రప్రదేశ్లో మొదటిసారిగా షో రూమ్ లో ప్రారంభించడానికి గోరంట్లకు వచ్చానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జీఎం ఎస్ జె పాటిల్, కృష్ణ, జే ఎం డి గౌస్, అరవింద్ నాయుడు, డీలర్ శ్రీనివాసులు, రొద్దప్ప, పవన్,లోకేష్, రంగా, మాజీ సర్పంచ్ నరసింహమూర్తి, చింతా రామచంద్రారెడ్డి,నార్సింపల్లి శ్రీనివాసులు, ఫోటో స్టూడియో హరి, సింగిరెడ్డిపల్లి శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

# దాడిలో గాయపడిన వైసీపీ నేతను పరామర్శించిన వి.ఆర్ రామిరెడ్డి

టీడీపీ కార్యకర్తల దాడిని ఖండించిన మాజీ సమన్వయకర్త

పెద్దవడుగూరులో భౌతిక దాడులు అనాగరికం: వి.ఆర్ రామిరెడ్డి

**తాడిపత్రి జులై 08, సీమ వార్త సాయంత్రం:** జూలై 8న టీడీపీ కార్యకర్తలు చేసిన దాడిలో గాయపడి అనంతపురం పట్టణంలోని కావేటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నాయకుడు చిన్నవడుగూరు మదనమోహన్ రెడ్డి ని వైసీపీ మాజీ సమన్వయకర్త వి.ఆర్ రామిరెడ్డి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చిన వి.ఆర్ రామిరెడ్డి, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించేందుకు తమవంతు సహాయం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ఎదగడం చేతకాక



భౌతిక దాడులకు దిగడం అనాగరికం, అమానుష ప్రక్రియ" అని తీవ్రంగా మండిపడ్డారు. ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలు సరికాదని అన్నారు.

**పోలీసులకు హెచ్చరిక**

ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**తాడిపత్రిలో ఉద్రిక్తతలు**

తాడిపత్రి నియోజకవర్గంలో ఇటీవల కాలంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ దాడి జరగడం గమనార్హం. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రోగులపై నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు అందించాలి

గంజాయి బ్యాచ్ పై పోలీసులు దృష్టి పెట్టాలి

జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి

**వేంపల్లె, జులై 09, సీమవార్త సాయంత్రం.** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులపై నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలను వైద్యులు అందించాలని జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో మండల ఉపాధ్యక్షులు మెహతాబ్, రమణమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేంపల్లె పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎంపిడిఓ కుళాయమ్మ, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డిలు కోరారు. వేంపల్లెలో ఎక్కువగా గంజాయి బ్యాచ్ లు ఉన్నాయాని కాబట్టి వారిపై దృష్టి పెట్టాలని పోలీసు అధికారులను జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతి రోజూ సాయంత్రం పూట గస్తీ చేయాలని జడ్పీటీసీ కోరారు. డ్రగ్స్, గంజాయిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఐ తాయార్ హుస్సేన్ చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొంటామని సభ్యులుకు తెలిపారు. విద్యుత్ సరఫరా లేక పోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్సరే మూలనపడిదని ఎంపిటిసి మణి గోపాల్ రెడ్డి, కటిక చంద్రశేఖర్, మండలాధ్యక్షురాలు మొహతాబ్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశంలో ఎక్సరే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి సభ్యులకు హామీ ఇచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన సబ్సిడీ వేరుశెనగ విత్తనాలను కత్తులూరు,నాగూరు, బక్కన్నగారిపల్లె గ్రామాల్లో ఉన్న రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి బాల గంగధర్ రెడ్డి తెలిపారు. కత్తులూరు పంచాయతీలోని నందిపల్లెతో పాటు మరికొన్ని గ్రామాల్లోని రైతులకు కూడ వేరుశెనగ విత్తనలు పంపిణీ చేయాలని జడ్పిటిసి అధికారులను కోరారు. పంటల సాగును బట్టి రైతులకు యూరియా కూడ పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఎఓ బాలగంగాధర్ రెడ్డి తెలిపారు. రైతులకు సకాలంలో వరి సాగు చేసే రైతులకు యూరియా పంపిణీ చేయాలని ఎంపిటిసి పద్మా రాజ్ కుమార్, మణి గోపాల్ రెడ్డిలు అధికారులను కోరారు. వరి పంట సాగు చేసే రైతులకు ఎకరాకు మూడు బస్తాల యూరియా సరిపోదని ఎంపిటిసి సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా ఈ క్రాఫ్ చేసుకోవాలని ఎఓ కోరారు. పంటలకు రైతులు నేరుగా భీమా కూడ కట్టవచ్చని తెలిపారు.




ఈ క్రాఫ్ నమోదు చేసుకుంటేనే నష్ట పరిహారం వస్తుందని తెలిపారు. చీనీ ఉల్లి, అరటి పంటలకు కూడ దిగుబడి ఆధారిత, వాతవరణ భీమా కింద 1 హెక్టార్ చీనీకి రూ 6 వేలు, అరటి కి రూ 8 వేలు భీమాను రైతులే స్వయంగా చెల్లించు కోవచ్చు అన్నారు. మామిడి, దానిమ్మ, చీనీ పంటలు సాగు చేసుకొనే రైతులకు మొదటి సంవత్సరం 30 వేలు సబ్సిడీ, రెండోవ సంవత్సరం 20 వేలు ప్రభుత్వం ఇస్తుంది హార్టీకల్చర్ ఎఇ రాఘువేంద్రారెడ్డి చెప్పారు. 10 మంది రైతులు ఫారంపడ్స్ ఏర్పాటు చేసుకొనేందుకు 75శాతం సబ్సిడీ కింద రూ 18 లక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలవలపాడులో ఉన్న రైతులు కూడ సబ్సిడీ వేరుశెనగ విత్తనలు పంపిణీ చేయాలని డిప్యూటీ మండలాధ్యక్షురాలు రవణమ్మ వ్యవసాయ అధికారులను కోరారు.

వేంపల్లె సబ్ డివిజన్ పరిధిలో ని విద్యుత్ శాఖలో ఎడిఏ అధికారి తప్పా ఇతర అధికారులు లేక పోవడం చాలా బాధకరమని జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి తెలిపారు. అధికారులు లేక పోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వేంపల్లె సబ్ డివిజన్ పరిధిలోని చక్రాయపేట, వేముల, వేంపల్లి మండలాలకు సంబంధించి 6 మంది సబ్ ఇంజనీర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరని జడ్పీటీసీ తెలిపారు. వేముల ప్రాంతాల్లోనే రెగ్యులర్ ఎఇ ఉన్నట్లు చెప్పారు. చక్రాయపేట, వేంపల్లె ప్రాంతాల్లోఎఇలు, జెఇలు లేక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. పులివెందుల నుండి డిప్యూటేషన్ పై వేంపల్లెకు వచ్చి జెఇ పని చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ చేసే విధంగా తీర్మానం చేసి జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు నివేదికలు పంపాలని ఎంపిడిఓ కుళాయమ్మను జడ్పీటీసీ కోరారు. ఉపాధి హామీ పథకంకు సంబంధించి కూలీలు 12 గంటల వరకు పని చేసే విధంగా ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి అదేశించారు. వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో వీధిలైట్లు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపిటిసి సభ్యులు భారతి, మణి గోపాల్ రెడ్డి, పద్మా జయ లక్ష్మి దేవి కోరారు. వేంపల్లె మండలం వ్యాప్తంగా 1132 డ్వాక్రా సంఘాలు ఉండగా ఈ ఏడాది మహిళా సభ్యులకు రూ 60 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నట్లు వెలుగు సిసి రామలింగయ్య తెలిపారు. ఇప్పటి వరకు రూ 19.50 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. స్త్రీనిధి కింద రూ 24 కోట్లు లక్ష్యం ఉందని ప్రస్తుతం రూ 7 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఎఫ్ పిజీ కింద 100 సంఘాలు చేయాలని లక్ష్యం కాగా 34 సంఘాలు చేసినట్లు సిసి తెలిపారు. మహిళ సంఘం సభ్యులు వేంపల్లెలోని బైపాస్ రోడ్డులో అరకు కాఫీ సెంటర్ ఏర్పాటు చేసుకొనేందుకు రూ 10 లక్షలు రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అరకు కాఫీ సెంటర్ చేసుకొంటే రూ 3.50 లక్షలు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి కలిగిన మహిళా సభ్యులు ముందుకు రావాలని చెప్పారు. 3.50 కోట్లతో 33 సిమెంట్ రోడ్డు పనులు చేసినట్లు పంచాయతీ రాజ్ ఎఇ శ్రీనివాసులు తెలిపారు. పారిశుధ్యం పనులకు సిబ్బందిని పెంచాలని ఎంపిటిసి సభ్యులు అధికారులను కోరారు. గ్రామ పంచాయతీలో పనులు చేయని సిబ్బంది చాలా మంది ఉన్నారని వారిని పని చేసే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిటిసిలు సభ దృష్టికి తెచ్చారు. వేంపల్లె మండలం వ్యాప్తంగా 46 వేల ఓటర్లు ఉన్నట్లు తాహసిల్దారు శివశంకర్ రెడ్డి చెప్పారు. సర్ కింద 72 శాతం ఓటర్లకు మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా 13 వేల మంది ఓటర్లకు చెందిన మ్యాపింగ్ చేయాల్సి ఉందని అన్నారు. రాజీవ్ నగర్, హరిజన వాడలో పిఎం సూర్య ఘర్ పథకం కింద 140 ఇళ్లుకు సోలార్ ప్యానల్ పిట్టింగ్ చేసినట్లు ఇన్ చార్జ్ జెఇ కెసి మైకేల్ జాక్సన్ తెలిపారు. ఇంకా 150 గృహాలకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఓ కుళాయమ్మ కోరారు. అనంతరం ఆయా శాఖల పని తీరుపై సభ్యులు చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్ఐ తాయార్ హుస్సేన్, రోడ్డు భవనాల శాఖ ఏఈ మనోహర్ రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య, ఐసిడిఎస్ సిడిపిఓ సునీత, సూపర్ వైజర్ స్వర్ణలత, వైద్యాధికారులు, ఎంపిటిసిలు శివశంకర్ రెడ్డి, బ్రహ్మయ్యతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వామి వారికి మొక్కు చెల్లించుకున్న హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్



**లేపాక్షి జులై 09సీమా వార్త సాయంత్రం.** తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ చెన్నప్ప సజ్జనార్ గతంలో లేపాక్షి గ్రామంలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శిం చారు. సందర్భంగా పోలీస్ కమిషనర్ స్వామివారి జత వెండి దీపాలు (62 గ్రాములు 280 మిల్లి గ్రాములు) వాటిని గురువారం సిబ్బంది ద్వారా ఆలయ అర్చకలకు అందజేశారు. సిటీ సజ్జనార్ స్వామి వారి ఆలయాన్ని సందర్శిం చిన సమయంలో స్వామివారి మొక్కుకోవడం జరిగింది.. అందుకుగాను మొక్కను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన డైరెక్టర్ తుడిమెల్ల మురళికి ఘన సన్మానం...



**బద్వేల్ జూలై 9 సీమ వార్త సాయంత్రం.** పౌరసరఫరాలు ఆహార మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ గా నియమితులను సందర్భంగా మా అత్యంత సన్నిహితుడు, సోదరసమానుడు, రాజకీయ అనుభవశాలి తుడిమెళ్ళ మురళి కృష్ణ అన్న గారిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశాము. ఈ కార్యక్రమంలో (ఏఎంసి)డైరెక్టర్ చిన్ని సుబ్బారావు గారు, గోపవరం మండలం నాయకులు పొత్తపి మనోహర్, మోడెమ్ లక్ష్మీనారాయణ, బండారు శ్రీకాంత్, మద్దేల శ్రీకాంత్, శివ కార్తీక్, రాజేష్, నాగార్జున, మల్లికార్జున పాల్గొన్నారు.

## ఇక 5 రోజుల సమయం మాత్రమే



**ద్వేల్ జూలై 9 సీమ వార్త సాయంత్రం.** బద్వేల్ మున్సిపాలిటీ 3వ వార్డ్ (వల్లెరవారి పల్లె)సర్ సరళిని వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ విభాగ కార్యదర్శి గుర్రంపాటి రమణారెడ్డి మరియు సింగల్ విండో మాజీ అధ్యక్షుడు నాగలకుంట్ల కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లు మరియు నిర్వహణపైసచివాలయ సిబ్బంది తో,మరియు గ్రామ ప్రజలతో ఇక 5 రోజుల సమయం మాత్రమే ఉన్నందున గ్రామ ప్రజలు ,బూతు లెవల్ ఏజెంట్లు ,బూతు లెవెల్ ఆఫీసర్లకు సహకరించి ఈ కార్యక్రమాన్ని త్వరతగతిన పూర్తి చేయవలసినదిగా కోరడమైనది.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం కావాలి.

.... టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం.

.... హాజరైన... మండల అబ్జర్వర్స్ డివి ఆంజనేయులు, మాధవ నాయుడు.







**గోరంట్ల జులై 10 సీమ వార్త సాయంత్రం.** మండలం లోని గంగంపల్లి పంచాయతీ మీటింగ్ సమావేశం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా అబ్జర్వర్ డీవీ ఆంజనేయులు, మాధవనాయుడు కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ మరియు ప్రతి బూత్ లో ఆ బూత్ కు సంబందించిన నాయకులు,కార్యకర్తలు, యానిమేటర్స్,స్టోర్ డీలర్స్,ఫీల్డ్ అసిస్టెంట్ జులై 14తేదీ వరకు మరింత వేగవంతం చేయాలని సూచించారు..ఈ కార్యక్రమంలో గుత్తాబాలకృష్ణచౌదరి టీడీపి మండల కన్వీనర్,రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, టీడీపిజిల్లాఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, టీడీపి జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్,పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లలచెరువు చంద్ర,,క్లస్టర్,యూనిట్, బూత్, ఇంచార్జులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881